# Poems for Main Competition

శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు నౌరాయనగా
ధారాళమైన నీతులు
నోరూరగ జవులుపుట్ట నుడివెద సుమతీ!

గంగిగోవు పాలు గరిటెడైనను జాలు
కడివెడైననేమి ఖరము పాలు?
భక్తిగల్గు కూడు పట్టెడైనను జాలు
విశ్వదాభిరామ వినురవేమ!

అక్కరకు రాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమున దా
నెక్కిన బారని గుర్రము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!

ఆత్మశుద్ధిలేని ఆచార మదియేల
భాండ శుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజలేలరా
విశ్వదాభిరామ వినురవేమ!

అడిగిన జీతంబియ్యని
మిడిమేలపు దొరనుగొల్చి మిడుకుటకంటెన్
వడిగల యెద్దుల గట్టుక
మడి దున్నుకు బ్రతుకవచ్చు మహిలో సుమతీ!

అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను
సజ్జనుండు బల్కు జల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ!

అప్పిచ్చువాడు, వైద్యుడు
నెప్పుడు నెడతెగక బారు నేరును, ద్విజుడున్
జొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు జొరకుము సుమతీ!

మేడిపండు జూడ మేలిమై యుండు
పొట్ట విచ్చి జూడ పురుగులుండు
పిరికివాని మదిని బింక మీలాగురా
విశ్వదాభిరామ వినురవేమ!

వినదగు నెవరు జెప్పిన
వినినంతనె వేగ పడక వివరింప దగున్
కని కల్ల నిజము దెలిసిన
మనుజుడె పో నీతిపరుడు మహిలో సుమతీ!

ఉపకారికి నుపకారము
విపరీతముగాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక జేయువాడు నేర్పరి సుమతీ!

వేరుపురుగు జేరి వృక్షంబు జెరచు
చీడపురుగు జేరి చెట్టు జెరచు
కుత్సితుండు జేరి గుణవంతు జెరచురా
విశ్వదాభిరామ వినురవేమ!

కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమున
దొనరగ బట్టముగట్టిన
వెనుకటిగుణ మేల మాను వినరా సుమతీ!

## Poems for Main Competition

పదుగురాడు మాట పాటియై ధరజెల్లు
ఒక్కడాడు మాట ఎక్కదెందు
ఊరకాడువాని నూరెల్ల వోపదు
విశ్వదాభిరామ వినురవేమ!

కూరిమిగల దినములలో
నేరము లెన్నడును గలుగ నేరవు మరి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!

చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కలి ముల్లు
ఇంటిలోని పోరు ఇంతింతకాదయా
విశ్వదాభిరామ వినురవేమ!

కొరగాని కొడుకు పుట్టిన
కొరగామియె కాదు తండ్రి గుణముల జెరచున్
జెరకుతుద వెన్ను పుట్టిన
జెరకున దీపెల్ల జెరచు సిద్ధము సుమతీ!

అల్పబుద్ధి వాని కధికార మిచ్చిన
దొడ్డవారినెల్ల దొలగగొట్టు
చెప్పుదినెడు కుక్క చేరకు తీపెరుగునా
విశ్వదాభిరామ వినురవేమ!

తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!

అనువుగానిచోట నధికుల మనరాదు
కొంచెముండుటెల్ల కొదువగాదు
కొండ అద్దమందు కొంచెమైయుండదా
విశ్వదాభిరామ వినురవేమ!

పట్టు పట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియ పట్టవలయు
పట్టు విడుటకన్న పడి చచ్చుటేమేలు
విశ్వదాభిరామ వినురవేమ!

# Poems for Tie-Breaking Round

తలనుండు విషము ఫణికిని
వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్
దలతోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!

అనగ ననగ రాగ మతిశయించుచునుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ!

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా
పుత్రుని గనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!

పెట్టిన దినములలోపల
నట్టడవులకైన వచ్చు నానార్థములున్
బెట్టని దినముల గనకపు
గట్టెక్కిన నేమిలేదు గదరా సుమతీ!

తప్పులెన్నువారు తండోపతండంబు
ఉర్వి జనులకెల్ల నుండు దప్పు
తప్పులెన్నువారు తమతప్పులెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ!

చంపదగినయట్టి శత్రువు తనచేత
జిక్కెనేని కీడు సేయరాదు
పొసగు మేలుచేసి పొమ్మనుటే చాలు
విశ్వదాభిరామ వినురవేమ!

నీరే ప్రాణాధారము
నోరే రసభరితమైన్ నుడువుల కెల్లన్
నారియె నరులకు రత్నము
చీరయె శృంగారమండ్రు సిద్ధము సుమతీ!

వాన రాకడయును బ్రాణంబు పోకడ
కానబడ దదెంత ఘనునికైన
గానబడిన మీద గలి ఎట్లు నడమరా
విశ్వదాభిరామ వినురవేమ!

మాటకు బ్రాణము సత్యము
కోటకు బ్రాణంబు సుభట కోటి ధరిత్రిన్
బోటికి బ్రాణము మానము
చీటికి బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ!

తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు
దిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు
జేరి మూర్ఖుని మనసు రంజింపరాదు

వగవకు గడచిన దానికి
బొగడకు దుర్మతులనెపుడు, పొసగని పనికై
యొగి దీనత నొందకుమీ
తగ దైవగతిం బొసంగు ధరను కుమారా!